క్లుప్తంగా

తలంబ్రాలతో కాలి నడకన భద్రాచలం



రావూరుపాడు నుంచి భద్రాచలం కాలి నడకన తలంబ్రాలను తీసుకుని వెళుతున్న భక్తులు

తాళ్లపూడి: రావూరుపాడు నుంచి శ్రీరామ నవమి సందర్భంగా గోటితో ఒలిచిన తలంబ్రాలను బుధవారం భద్రాచలం తీసుకెళ్లేందుకు పాదయాత్రగా భక్తులు బయలుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన శ్రీరామ బాలభక్త భజన సమాజం ఆధ్వర్యంలో సుమారు 150 మంది వరకు 15 రోజులుగా స్వామి వారి తలంబ్రాలకు కేటాయించిన ధాన్యాన్ని చేతితో ఒలిచి బియ్యం తీసి వాటికి పూజలు చేసి భద్రాచలం తీసుకుని వెళ్లారు. ఐదేళ్లుగా స్వామి వారికి తలంబ్రాలను కాలి నడకన తీసుకుని వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు అరిగెల శ్రీనివాస్, బసవ సత్యనారాయణ, కులకాని ఉప్పరశ్రీను , రేఖపల్లి వీరవెంకట రావు, జక్కుల భద్రం పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేపై శిక్షణ

నల్లజర్ల: మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన జీవనోపాధి, రుణాలను అందించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాలని వెలుగు డీపీఎం శ్రీనివాసబాబు కోరారు. బుధవారం నల్లజర్ల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఎన్యూమరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు డీపీఎం శ్రీనివాసబాబు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి కోసం రుణ ప్రణాళికలు రూపొందించే విధంగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళా సంఘాల్లోని విద్యావంతులను ఎన్యూమరేటర్లుగా నియమించినట్టు చెప్పారు. వీరంతా సంఘ సభ్యుల ఇళ్లకు వెళ్లి మొబైల్ యాప్ వివరాలు సేకరిస్తారన్నారు. దీనిపై ఎన్యూమరేటర్లకు శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించి రుణ ప్రణాళికలు తయారు చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్యాంసుందర్, సీసీలు మాలిని, రాధ పాల్గొన్నారు.

తీపర్రు విద్యార్థి నవోదయకు ఎంపిక



తీపర్రులో అఖిలేష్‌ను అభినందిస్తున్న ఎంఈఓ బాలసుబ్రహ్మణం

పెరవలి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడం అభినందనీయమని ఎంఈఓ బి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పెరవలి మండలం తీపర్రులో- 1 పాఠశాల విద్యార్థి కోడూరి అఖిలేష్ నవోదయకు ఎంపికైన సందర్భంగా బుధవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని కొనియాడారు. ఎంఈఓ-2 నూర్జహాన్ మాట్లాడుతూ అఖిలేష్ నవోదయలో సీటు సాధించి మండలానికి ఎంతో పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చాముండేశ్వరి, ఉపాధ్యాయలు భాస్కరరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయంలో జనవాణి



నిడదవోలులో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు : ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జనవాణి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలో మంత్రి కార్యాలయంలో బుధవారం జనవాణి కార్యాక్రమాన్ని నిర్వహించారు. మంత్రి కందుల దుర్గేష్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

ఎండ ప్రచండం



నిర్మానుష్యంగా కొవ్వూరు-దేవరపల్లి రహదారి

- వారం నుంచి క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- గోపాలపురంలో ఐదు రోజుల క్రితమే 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పెరిగిన విద్యుత్ వినియోగం

కొవ్వూరు: భానుడి భగభగలతో జనం బెంబేలెత్తుతున్నారు. వడగాల్పుల ప్రభావంతో వేసవి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి 29న గోపాలపురంలో జిల్లాలోనే రికార్డుస్థాయిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గడిచిన వారం రోజుల నుంచి సాధారణం కంటే డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లోనూ మూడు, నాలుగు డిగ్రీల అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ వెల్లడిస్తోంది.

క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు, దేవరపల్లి, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో బుధవారం 36 నుంచి 38 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. నల్లజర్ల, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 37 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. గడిచిన నాలుగు రోజుల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే ఉష్ణతాపం అధికంగా ఉంటోంది. పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోత పెరగడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు, ఇతర పానీయాలను సేవించి ఉపశమనం పొందడంతో వాటి వినియోగం విపరీతంగా పెరిగింది.

ఉష్ణోగ్రతలో సమతుల్యత దెబ్బతిని రోగాల బారిన ప్రజలు

వృద్ధులు, చిన్నారులు ఎండల తీవ్రతకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉష్ణోగ్రతలో సమతుల్యత దెబ్బతినడంతో అనేక మంది జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. ఎండల తారెత్తిస్తుండడంతో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వ్యాపారాలు సైతం మందకొడిగానే సాగుతున్నాయి. దీంతో కొందరు వ్యాపారులు తమ దుకాణాలను మధ్యాహ్నం పూట రెండు, మూడు గంటల పాటు మూసివేస్తున్నారు. మళ్లీ ఎండల తీవ్రత తగ్గిన తర్వాత దుకాణాలు తెరుస్తున్నారు.

వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, తగిన నిద్ర పట్టకపోవడం, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం వంటి లక్షణాలను వడదెబ్బగా గుర్తించవచ్చు. ఎండాకాలంలో మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి. నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. మద్యం సేవించడం, కలుషితమైన ఆహారం తినకూడదు.

వడదెబ్బకి ప్రథమ చికిత్స అవసరం



పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వెంటనే ఆసుపత్రికి తరలించాలి. గాలి తగిలే ప్రదేశంలో నీడలో ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకు చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరం తుడవాలి. ఓఆర్ఎస్ ద్రావణం, ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం తాగించాలి.

– ఎస్.ధర్మరాజు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, దొమ్మేరు

కడియాలమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

దేవరపల్లి: ఉగాది వేడుకల సందర్భంగా దేవరపల్లిలో కొలువైన గ్రామ దేవత కడియాలమ్మ వారి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దేవరపల్లి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చాగల్లు: కలవలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున ఈ నెల 3వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీల రోజు వేతనం రూ.307



చెరువు తవ్వకం పని ఉపాధి కూలీలు

నల్లజర్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో రోజుకు కనీస వేతనం రూ.307 చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో రోజుకు కనీస వేతనం రూ.300 ఉండగా ఈ ఏడాది స్వల్పంగా రూ.7 పెంచారు. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయని ఏపీఓ వెంకట్రావు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేస్త్రీలు కేటాయించిన కొలతలతో పనులు పూర్తి చేస్తే కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట వేతనం అందనుంది. గత ఐదేళ్లతో పోల్చితే ఈ ఏడాది పెంచిన కూలీ తగ్గించినట్టేనని కూలీలు చెబుతున్నారు. 2020–21లో రూ.230 చెల్లిచేవారు. 2022లో రూ.15 పెంచారు. 2023లో రూ.12, 2024లో రూ.15, 2025లో రూ.28 పెంచారు. ఈ ఏడాది కనీస వేతనం రూ.7 పెంచడంపై కూలీలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలో ప్రస్తుతం రైతు వారీ పనులు లేవు. ఉన్న పనులన్నీ యంత్రాలతో చేయిస్తున్నారు. గ్రామీణ కూలీల జీవనోపాధికి ఉపాధిహామీ పనులే ఆధారం. మండుటెండలో సైతం కూలీలు చెమటలు కక్కుతూ పనులు చేస్తున్నారు. కుటుంబ పోషణకు ఉపాధి పనుల్లో పాల్గొనే శ్రమజీవులకు మరికొంత ఎక్కువ మొత్తంలో వేతనాలు పెంచాలని వేతనదారులు కోరుతున్నారు.

శ్మశాన వాటిక నిర్మాణం



సింగరాజుపాలెంలో నిర్మించిన నూతన శ్మశాన వాటిక

నల్లజర్ల: సింగరాజుపాలెంలో గతంలో శ్మశాన వాటిక ఊరచెరువులో ఉండేది. వర్షాలు అధికంగా కురిసినపుడు చెరువు మొత్తం నీళ్లతో నిండిపోయేది. అటువంటి సందర్భాలలో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని ఖననం చేయడానికి లేదా దహన సంస్కారాలు చేయడానికి వీలుండేది కాదు. అంత్యక్రియల నిర్వహణకు వ్యయప్రయాసలకోర్చి వేరే గ్రామాలకు మృతదేహాలను తీసుకెళ్లేవారు. ప్రజల ఇబ్బందులు గుర్తించిన గ్రామ పెద్ద, దివంగత గారపాటి సత్యనారాయణ కుటుంబ సభ్యులు తమ సొంత ఖర్చులతో శివాలయం ఎదురుగా శ్మశాన వాటికను ఏర్పాటు చేసి పైన సిమెంట్ శ్లాబుతో పైకప్పు, బీడు పొయ్యిలు ఏర్పాటు చేసారు. నిర్మాణం పూర్తయిన తర్వాత దీనిని సర్పంచ్ గద్దే బాలగంగాధర తిలక్‌కు అప్పగించారు.

ఖండవల్లిలో రీ సర్వే పూర్తి



ఖండవల్లిలో రీ సర్వే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది, రైతులు

పెరవలి: ఖండవల్లి గ్రామంలో 3,341 ఎకరాలకు రీ సర్వే పూర్తయ్యిందని ఇందులో వచ్చిన భూ హెచ్చు, తగ్గుదలను రైతుల సమక్షంలో సరిచేస్తున్నామని రీసర్వే డీడీ టి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి మండలం ఖండవల్లిలో బుధవారం రీసర్వేపై రైతులతో కలసి అధికారులు గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో రైతులు, అధికారులు కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో 3,341.97 ఎకరాల భూమి ఉండాలని రీ సర్వేలో 3,341.34 సెంట్లు భూమి ఉన్నట్లు గుర్తించామని, దీనితో 63 సెంట్లు భూమి తగ్గిందన్నారు. ఈ రీసర్వేలో కొందరి భూములు ఎక్కువ ఉన్నట్లు, మరి కొందరి భూమి తక్కువ ఉన్నట్లు గుర్తించామని ఈ తేడాలను ఇరు రైతులను కూర్చోబెట్టి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ విధంగా సమస్యలు 500 ప్రాంతాల్లో ఉత్పన్నంకాగా వీటిలో 50 శాతం వరకు సరిచేసామని, మిగిలినవి ఇరు రైతుల సమష్టి అభిప్రాయం మేరకు సరిచేస్తామన్నారు. ఈ సర్వేలో గ్రామంలో ఉన్న భూమిని 11 బిట్లుగా కేటాయించి సర్వే చేశామని తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో రీసర్వే చేపట్టి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసామన్నారు. రీ సర్వేకు సహకరించిన రైతులకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, డీడీ సన్నిబాబు, సర్వేయర్ శేఖకుమార్, నాయకులు అతికాల శ్రీనివాస్, అన్ని గ్రామాల వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ



తడి, పొడి చెత్తపై సమావేశంలో మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్

నల్లజర్ల: ఘనవ్యర్థాల నిర్వహణపై క్లాప్‌మిత్ర, షెడ్ మిత్రలకు గంటావారిగూడెంలో చెత్తసంపద కేంద్రం వద్ద బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ఐటీసీ ట్రైనింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. డీపీఆర్‌సీ నుంచి రీసోర్స్‌పర్సన్‌గా మొయినుద్దీన్ పాల్గొని వివిధ అంశాలపై వివరించారు. తడి, పొడి చెత్త సేకరణపై మీరంతా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. చాలా ప్రాంతాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా కాకుండా కలిపి ఇస్తున్నారని దీనిపై పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గృహిణులతో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింహాద్రి, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్, గోపాలపురం మండలం నుంచి 77 క్లాప్‌మిత్ర, షెడ్ మిత్రాలు ఈ శిక్షణకు హాజరయ్యారు.

వంద మందికి గుండె వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో వృద్ధాశ్రమం వద్ద బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వైవీ రావు హస్పిటల్‌కు చెందిన వైద్యులు సుమారు 100 మందికి గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. బీపీతో పాటు ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సుమారు 10 మందికి ఆపరేషన్ల నిమిత్తం సిఫారసు చేశారు.

స్వయం ఉపాధి రుణాల కోసం ఇంటర్వ్యూలు



తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంక్ అధికారులు

తాళ్లపూడి: స్వయం ఉపాధి సోపానంలో రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంఈపీడీవో టీబీ వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని మొత్తం 655 మంది దరఖాస్తు చేయగా వారిలో 486 మంది ఇంటర్వూయ్యలకు హాజరైనట్టు తెలిపారు. తాళ్లపూడి యూనియన్ బ్యాంక్, ప్రక్కిలంక, పెద్దేవం స్టేట్ బ్యాంక్, అన్నదేవరపేట బ్యాంక్ ఆఫ్ ఇండియా, ధర్మవరం, పంగిడి యూనియన్ బ్యాంక్‌ల పరిధిలోని గ్రామాల్లో లబ్ధిదారులను బ్యాంక్ అధికారులు యూనిట్ వివరాలపై ప్రశ్నలు వేసి ఇంటర్వూయ్యలు చేసారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో స్వయం ఉపాధి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

చాగల్లు: చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం స్వయం ఉపాధి కోసం అందించే రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అధ్యక్షతన బ్యాంకు మేనేజర్ల సమక్షంలో మండలంలోని 6 పంచాయతీల పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం, చంద్రవరం, మల్లవరం , చిక్కాల, దారవరం, గౌరిపల్లి గ్రామాలకు సంబంధించి ఆయా కార్పొరేషన్ల రుణాల కోసం మొత్తం 317 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. బుధవారం వీరిలో 265 మంది హాజరు కాగా, వారికి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం జీర్ణోద్ధరణకు రావటంతో పునర్నిర్మించాలని ఆలయ అధికారులు గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లా ఇంజనీరింగ్ అధికారులు బుధవారం ఆలయానికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఆలయం స్థానిక అధికారులు తెలిపిన వివరాల మేరకు పరిశీలనకు వచ్చామని తెలిపారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ ఇంజనీరింగ్ అధికారులకు ఈ ఆలయం 50 ఏళ్ల క్రితం నిర్మించడం వల్ల జీర్ణోద్ధరణకు వచ్చిందని, అంతే కాకుండా జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు ఎత్తు పెరిగి గుడి 5 అడుగుల లోతులో ఉందని, దీనితో వర్షాకాలంలో నీరు ఆలయంలోకి వస్తోంన్నదని తెలిపారు. అంతే కాకుండా శ్లాబ్ శిథిలావస్థకు చేరిందని, శ్లాబ్ లీక్‌లు ఉండటం వలన వర్షం వచ్చినప్పుడు నీరు ఆలయంలో పడుతోందని తెలిపారు. అధికారులు సమస్యలన్నింటినీ పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జామాయిల్ తోట దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దేవరపల్లి: స్థానిక శాంతి మందిరం సమీపంలోని జామాయిల్ తోటలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గ్రామానికి చెందిన మల్లపురాజు దుర్గకు చెందిన జామాయిల్ తోటలో మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు కొవ్వూరు అగ్నిమాపక అధికారికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక అధికారి ఏవీఎస్ఎస్ వేణు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆకతాయిలు సిగరెట్ వెలిగించి తోటలోకి విసరడం వల్ల మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది.

పిల్లల అభివృద్ధికి ఆటిజంతో ఆటంకం



కానూరు భవిత కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంఈఓ షేక్ నూర్జాన్

పెరవలి: ఆటిజం పిల్లల అభివృద్ధికి ఆటంకం కలిగించే ఒక రుగ్మత అని, ఇది శారీరక, మానసిక, సాంఘిక, బాషా నైపుణ్యాల అభివృద్ధిని ప్రభావితం చేస్తుందని ఎంఈఓ షేక్‌నూర్జాన్ తెలిపారు. ఆటిజం కలిగిన పిల్లల్లో మానసిక పరిపక్వత ఉండదని, దీని వల్ల వారు చెప్పిందే చెబుతారని, మాట్లాడిందే మాట్లాడతారని వారిని అర్థం చేసుకుని అక్కున చేర్చుకోవాలని ఎంఈఓ అన్నారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా కానూరు– 3 పాఠశాల ఆవరణలోని భవిత సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పిల్లలు అందరిలో కలవరని, ఆనందాన్ని, బాధలను వెల్లడించలేకపోతారని, వీరికి విభిన్న అలవాట్లు ఉంటాయని తెలిపారు. వీరిలో కొన్ని అంశాల్లో ప్రత్యేకత కలిగిన వారిని గుర్తించి శిక్షణనిస్తే ప్రావీణ్యత సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్, భవిత సిబ్బంది పి నాగమణి, కె శాంతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘శశి’లో విజయవంతంగా అవగాహన సదస్సు



వేలివెన్ను శశి విద్యాసంస్థల క్యాంపస్‌లో మాట్లాడుతున్న చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: పిల్లల భవిష్యత్తుకు శశి విద్యా సంస్థ భరోసా ఇస్తుందని చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. మండలంలో వేలివెన్ను శశి క్యాంపస్‌లో 6,7,8,9,10, 10+1లో ప్రవేశం పొందేందుకు వచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్, మొయిన్, నీట్ విద్యపై బుధవారం అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో 6వ తరగతి నుంచి ఐఐటీ, నీట్ విద్యపై ఫౌండేషన్ కోర్సు ప్రారంభించడం వలన ఎంతో పోటీ ఉన్నప్పటికీ తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. శశి విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగానే కాకుండా షార్‌లో సెంటిస్టులుగా కూడా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నూతన విద్యా విధానాన్ని వివరించారు. శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ మాట్లాడుతూ తమ హాస్టల్‌కు రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరుందని, చదువుతో పాటు పిల్లల ఆరోగ్యం కూడా ముఖ్యమని అన్నారు. శశి హాస్టల్‌లో విద్యార్థుల భోజన వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శశి అకడమిక్ డైరక్టర్లు మన్నె వెంకటేశ్వరరావు, చిట్టూరి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న గౌడ్ సేవలు స్ఫూర్తిదాయకం



కొవ్వూరులో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తాతా కృష్ణారావు, నాయకులు

కొవ్వూరు: బహుజన చక్రవర్తిగా పేరుగాంచిన సర్దార్ పాపన్న గౌడ్ సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాత కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా పట్టణ శివారున గామన్ ఇండియా బ్రిడ్జి జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, పాకా జయరామ్, మార్గాని ఆదినారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడు బొర్రా కృష్ణారావు, కొండేటి భీమారావు, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మన్నెం సన్నిబాబు, ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఆరికిరేవుల సర్పంచ్ మట్టా శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మారిశెట్టి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రాలు.. జీవిత సత్యాలు

సీటీఆర్ఐ: అరవై నాలుగు కళలలో చిత్రకళ ఒకటి. చిత్ర కళాకారుడి మనస్సు పరవశిస్తే చాలు కుంచే పట్టుకుని ప్రకృతిలోని అందాలను తన కాన్వాస్‌పై తీర్చిదిద్దుతాడు. జలపాతల సోయగాలు, అందమైన పూలవనం, జీవన విధానాలు ఇలా అనేక రకరకాలుగా చిత్రాలను గీచి మంత్రముగ్ధులను చేస్తారు. ఈ కళల రాజధాని రాజమహేంద్రవరం. ఇక్కడ కళాకారులకు లోటు లేదు. అందుకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న దామెర్ల ఆర్ట్స్ గ్యాలరీ ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడ ఉన్న చిత్రాలు సజీవంగా మన కళ్ల ముందే ఉన్నట్టు కనిపిస్తుంటాయి.

శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి..

రాజమహేంద్రవరం నగరంలోని సెంట్రల్ జైల్ రోడ్డు నుంచి లాలా చెరువు రహదారి ప్రధాన మార్గంలో ‘అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన’ను సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రపదేశ్ రాష్ట్రంలో దేశ వ్యాప్తంగా ఉన్న కళలకు ప్రాధాన్యం కలిగిస్తూ, రాష్ట్ర కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ఈ చిత్రకళా వీధిని ఏర్పాటు చేస్తున్నారు. చిత్రకళకి తిరిగి పూర్వ వైభవం తీసుకుని రావడంలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 500కి పైగా కళాకారులు పాల్గొని వారి చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఈ నెల నాలుగో తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన జరగనుంది.

లైవ్ చిత్ర ప్రదర్శన, అమ్మకాలు..

గతంలో గీచిన పెయింట్‌లు, అప్పటికప్పుడు గీస్తున్న పెయింటింగ్‌లను ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా చేపట్టనున్నారు. ఈ విక్రయాలు వల్ల వచ్చిన డబ్బుని దామెర్ల ఆర్ట్ గ్యాలరీకి ఉపయోగించనున్నారు. కానీ ఒక్క రోజు మాత్రమే ఉండడంతో ప్రదర్శన ఎంత వరకూ విజయవంతమవుతుందో లేదోనని చిత్రకళా ప్రియులు అంటున్నారు.

ఆశయం మంచిదే కానీ..

దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధికి ఈ నిధులను వెచ్చించడం మంచి ఆశయమే కానీ, ఇక్కడ చాలా సమస్యలున్నాయి. సెంట్రల్ జైల్ రోడ్డు, లాలాచెరువు రోడ్డు చాలా ట్రాఫిక్ ఉంటుంది. ఈ ప్రదర్శనల కోసం రోడ్డుకి ఇరువైపుల టెంట్లు వేసి ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత ట్రాఫిక్‌లో ప్రదర్శనలు తిలకించడానికి ప్రజలకు అనేక ఇబ్బందులు రావచ్చు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవ్వచ్చు. ఎండలో చిత్రకళాకారులు, చిత్రాలు చూడడానికి వచ్చిన ప్రజ లు అవస్థలు పడాల్సి ఉంటుంది. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ ప్రశాంతి, కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు ఎం.మల్లికార్జున రావులతో ‘అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన’ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com